Follow: @ANNTELUGU

18-06-2026

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 167 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## వ్యూస్ లో ఏఎన్ఎన్ రికార్డు 24గంటల్లో.. 15 మిలియన్లు

**హైదరాబాద్, మహా :** ఎఎన్ఎన్ డిజిటల్ ప్లాట్ ఫామ్స్ వ్యూస్ లో దుమ్మురేపుతున్నాయి. 24గంటల్లో 15 మిలియన్లకు పైగా వ్యూస్ తో ఎఎన్ఎన్ దూసుకుపోతోంది. తెలుగురాష్ట్రాల్లో వీక్షకుల ఆదరణతో ఎఎన్ఎన్ కు తిరుగులేదని మరోసారి చాటింది. ఎఎన్ఎన్ తెలుగు ప్రధాన ఛానల్ తో పాటు ఒరిజినల్స్, ఇన్స్టా, ఫేసుబుక్ ఇలా అన్ని ప్లాట్ ఫామ్స్ లో ఎఎన్ఎన్ తెలుగుప్రజల ఆదరణతో 24గంట్లలో కోటిన్నర కు పైగా వ్యూస్ సాధించి.. ప్రజల నమ్మకాన్ని గెలవడంలో మరోసారి ఛాంపియన్ గా నిలిచింది. ఎఎన్ఎన్ డిజిటల్ నెట్ వర్క్ లో తిరుగులేని సత్తా చాటింది. ఈ నేపథ్యంలో సంస్థ కార్యాలయంలో కేక్ కట్ చేసిన సీఈవో కంది రామచంద్రా రెడ్డి ఉద్యోగుల సంతోషంలో పాలు పంచుకున్నారు. కోటిన్నర మంది ఒకేరోజు వీక్షించడం ఎఎన్ఎన్ సంస్థపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని, నిజమే ఇజంగా అందరూ పనిచేసి సంస్థను మరింత పటిష్టపరచాలన్నారు.

టాప్ న్యూస్

### అనితకు మేకప్ మీద ఉన్న ప్రేమ మనుషుల ప్రాణాల మీద లేదు

యాంకర్ శ్యామల ఫైర్



03

### సాయికృష్ణ లాకప్ డెత్ పై పవన్ ఆగ్రహం

విచారణకు చంద్రబాబు ఆదేశం



02

### గుడివాడ అమర్నాథ్ అరెస్టుకు రంగం సిద్ధం

అనిత మేకప్ పై వ్యాఖ్యలు.. రాష్ట్రవ్యాప్తంగా కేసులు



03



తెలంగాణ పబ్లిక్ స్కూల్

## రేవంత్ మార్క్ విద్యా విప్లవం





ప్రభుత్వ బడికి 'నో అడ్మిషన్' బోర్డు .. చరిత్రలోనే తొలిసారి

ఆరుట్లలో నవశకానికి సీఎం శ్రీకారం

తరగతి గదిలోనే విద్యార్థుల భవిష్యత్తు ఉందన్న సీఎం

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి (ఇబ్రహీంపట్నం), మహా :** ప్రభుత్వ పాఠశాలలు అంటే కేవలం అనాథలు, ఆర్థికంగా చితికిపోయిన వారు మాత్రమే చదువుకునేవారన్న అపోహలను సంపూర్ణంగా చెరిపేస్తూ.. మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్కరణలకు పదునుపెట్టింది. అద్దాల మేడలు, రంగుల గోడలు అభివృద్ధికి సూచికలు కావని, తరగతి గదుల్లోనే తెలంగాణ భవిష్యత్తు ఉందన్న మహోన్నత లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'ను రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా, ప్రపంచ స్థాయి ప్రమాణాలు, అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ ఆదర్శ పాఠశాలను రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఆయన అంకితం చేశారు. ఇదే వేదికపై నుంచి విద్యార్థులకు ఉదయం పూట పౌష్టికాహారం అందించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన 'బ్రేక్ ఫాస్ట్ (అల్పాహారం)' పథకానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విధ్వంసమైన తెలంగాణ విద్యా విధానాన్ని వికాసం వైపు నడిపించే బృహత్తర కార్యానికి ఆరుట్ల పాఠశాల ఒక రోల్ మోడల్ గా, దిక్సూచిగా నిలుస్తుందని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ల్యాబ్‌లు, లైబ్రరీ, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను సీఎం స్వయంగా పరిశీలించారు.

## మితిమీరిన శ్రీకారం ఆగడాలు!

**వ్యవసాయ భూముల్లో అక్రమ లే అవుట్లు !**

"'ఆయుష్మాన్‌భవ్', 'ఐకానిక్ హౌసింగ్' ఫార్మ్ ల్యాండ్స్ పేర్లతో అక్రమ వెంచర్లు !

నాలా కన్వర్షన్, డిటిసిపి అనుమతులు లేకుండా జోరుగా అమ్మకాలు!

**గజాల్లో అమ్మకం గుంటల్లో రిజిస్ట్రేషన్లు!**

ప్రభుత్వ ఆదాయానికి బారీ గండి!

పంచాయత్ రాజ్ యాక్ట్ ని తుంగలో తొక్కిన తహసీల్దార్లు !

అక్రమ వెంచర్లకు వరంగా మారిన డీపీఓ మౌనం!"

**జిల్లా కలెక్టర్ స్పందిస్తేనే అక్రమాలకు అడ్డుకట్ట!**

02




అమాయక రైతుల నోళ్లు కొట్టి తక్కువ ధరకే భూములు గుంజుకోవడం.. నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కి అదే భూమిని సామాన్యులకు అంటగట్టి కోట్ల రూపాయలకు అమ్ముకోవడం! నారాయణ్‌ఖేడ్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 'శ్రీకారం రియల్ ఎస్టేట్' సంస్థ సాగిస్తున్న అడ్డగోలు దోపిడీ పై బహిరంగ విమర్శలు వ్యక్త మవుతుండగా: చెమటోడ్చిన అన్నదాతల అవసరాలను ఆసరాగా చేసుకుని, ఎకరం కేవలం రూ. 5 లక్షల అరకొర ధరకే చేజిక్కించుకున్న ఈ రియల్ కేటుగాళ్లు.. చట్టాన్ని, ప్రభుత్వ నిబంధనలను గాలికొదిలేసి ఫార్మ్‌లాండ్ ముసుగులో ఆ వ్యవసాయ భూమిని గుంటల లెక్కన విభజించి, ఒక్కో గుంట (121 గజాలు) ప్లాట్‌ను భారీ ధరలకు విక్రయిస్తూ.. ఎకరాన్ని ఏకంగా రూ. 60 లక్షల చొప్పున విక్రయిస్తూ అక్రమ వసూళ్లకు తెరలేపారు. కనీసం హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతుల ఆనవాళ్లు కూడా లేని 'ఆయుష్మాన్‌భవ్', 'ఐకానిక్ హౌసింగ్' వెంచర్ల పేరిట ఇంతటి నయవంచన సాగుతున్నా.. క్షేత్రస్థాయి పరిశీలన చేయాల్సిన రెవెన్యూ అధికారులు మౌనం వహించడం వెనుక పెద్ద ఎత్తున 'మామూళ్ల' మతలబు ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### హనుమకొండలో పర్యటించిన పవన్ కళ్యాణ్

- సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన ఏపీ డిప్యూటీ సీఎం
- సోషల్ మీడియాలో సుదీర్ఘ పోస్ట్ చేసిన జనసేనాని

03





### టీజీ టీ20 టోర్నమెంట్‌పై వివాదం

02

- హీరో విజయ్ దేవరకొండకు లీగల్ నోటీసులు
- భట్టి, జూపల్లి కొడుకులకు టోర్నమెంట్‌తో ఏం సంబంధం?

### మోదీపై ట్రంప్ ప్రశంసల జల్లు

- ఫ్రాన్స్ జీ-7 సదస్సులో అనూహ్య పరిణామాలు
- ఆయనెంతో ప్రశాంతం.. నేను అలా కాదు.

03



### ఒప్పందం నచ్చకపోతే మళ్లీ బాంబులేస్తాం

- ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

### హైడ్రా చట్టానికి అతీతం కాదు

- ప్రైవేటు ఆస్తిలోకి ఎలీ వెళ్తారంటూ కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు సీరియస్
- చట్ట పరిధిని దాటి వ్యవహరించే హక్కు హైడ్రాకు లేదని స్పష్టం

03










### సీఎం రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే

- కిషన్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వంపై కావాలని నిందలు
- సీఎం లేఖపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధ్వజం
- కేంద్ర మంత్రులు, ప్రధానిని రేవంత్ కలిసినప్పుడల్లా కిషన్ రెడ్డికి చెప్పారా
- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేంద్రంపైనా, కిషన్ రెడ్డిపైనా ఆరోపణలు

02



# మితిమీరిన శ్రీకారం ఆగడాలు!






**స్పెషల్ టాస్క్ ఫోర్స్ :**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్ సిర్గాపూర్, మనూర్ మండలాల పరిధిలో 'శ్రీకారం ఇన్ఫ్రా డెవెలపర్స్' 'ఆయుష్మాన్‌భవ్' ఐకానిక్ హౌసింగ్' సంస్థల పేరిట సాగుతున్న ఫార్మ్ ల్యాండ్ దందాలో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతుంది. అక్కడ ప్రభుత్వానికి వచ్చే ఆదాయం 'పిసరంత' అయితే.. అధికారుల జేబుల్లోకి వెళ్లేది 'గుమ్మడికాయంత' అని స్థానికులు చర్చించుకుంటున్న తీరు.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న లూటీకి అద్దం పడుతోంది. ప్రభుత్వ మార్కెట్ విలువకు, ఈ సంస్థ సాగిస్తున్న అక్రమ విక్రయాల ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పరిశీలిస్తే.. నాలా ఫీజులు, స్టాంప్ డ్యూటీ రూపంలో ప్రభుత్వానికి భారీ మొత్తంలో గండి కొడుతున్నట్లు కళ్లకు కట్టినట్లు స్పష్టమవుతోంది.
ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం ఎకరం వ్యవసాయ భూమి ధర కేవలం రూ. 1.50 లక్షలు మాత్రమే. కానీ 'శ్రీకారం' సంస్థ ఫార్మ్‌లాండ్ ముసుగులో చేస్తున్న వ్యాపార విలువల అంకెల గారడీ ఇలా ఉంది:
వాంగ్దల్ గ్రామ పరిధిలో (ఆయుష్మాన్‌భవ్): ఇక్కడ ఒక్కో గుంట (121 గజాల) ప్లాట్‌ను ఈ సంస్థ ఏకంగా రూ. 1,60,000 చొప్పున విక్రయించింది. అంటే ఎకరాన్ని (40 గుంటలు) దాదాపు రూ. 64 లక్షల ధరకు సామాన్యులకు అంటగట్టింది.
దవూర్ గ్రామ పరిధిలో (ఐకానిక్ హౌసింగ్): ఇక్కడ అక్రమాలు మరింత శ్రుతిమించాయి. కేవలం 121 గజాల ప్లాట్‌ను ఏకంగా రూ. 4,65,000 లాంటి విస్తుపోయే ధరకు విక్రయిస్తూ.. ఎకరాన్ని ఏకంగా రూ. 1.80 కోట్లకు పైగా విక్రయిస్తూ అడ్డగోలు వసూళ్లకు తెరలేపింది.
ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంత భారీ ధరకు ప్లాట్లు అమ్మినప్పుడు.. లేఅవుట్ అనుమతులు తీసుకుని, ఆ అమ్మకపు విలువ ప్రకారమే స్టాంప్ డ్యూటీ, నాలా ఫీజులు ప్రభుత్వానికి చెల్లించాలి. కానీ, ఈ కేటుగాళ్లు చట్టంలోని లొసుగులను వాడుకుంటూ.. ప్రభుత్వ మార్కెట్ విలువ తక్కువగా ఉన్న వ్యవసాయ భూమి కింద గుంటల లెక్కన నామమాత్రపు ఫీజుతో రిజిస్ట్రేషన్లు కానిచ్చేస్తున్నారు.

### జిల్లా కలెక్టర్ స్పందిస్తేనే అక్రమాలకు అడ్డుకట్ట!

స్థానిక రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారుల పాత్రపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో.. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా స్పందిస్తేనే ఈ అక్రమ అడ్డగోలు దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని, 'ఆయుష్మాన్‌భవ్', 'ఐకానిక్ హౌసింగ్' వెంచర్లపై కలెక్టర్ స్వయంగా టాస్క్‌ఫోర్స్ కమిటీతో సమగ్ర విచారణ జరిపించి, అక్రమ లేఅవుట్లను సీజ్ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన రియల్ సంస్థపై, వారికి పరోక్షంగా సహకరిస్తున్న అధికారులపై విజిలెన్స్ చర్యలు తీసుకుంటేనే సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందని నియోజకవర్గ ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

ఫలితంగా, సంస్థకు కోట్ల రూపాయల లాభాలు ఊరకే దక్కుతుండగా.. ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన రాబడి మాత్రం నీళ్లపాలవుతోంది. ఈ భారీ పన్నుల ఎగవేత వ్యవహారం కళ్లముందే కనబడుతున్నా .. అటు రిజిస్ట్రేషన్ శాఖ, ఇటు రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక భారీగా మామూళ్ల మతలబు ఉందనే ఆరోపణలకు మరింత బలం చేకూరుతోంది.

**అక్రమ వెంచర్లకు వరంగా మారిన డీపీఓ మౌనం!"**
వ్యవసాయ భూముల్లో అక్రమ లే అవుట్లు !
తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామీణ పరిధిలో ఎలాంటి లేఅవుట్లు వేయాలన్నా, కమర్షియల్ విక్రయాలు జరపాలన్నా స్థానిక సంస్థల, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) అనుమతులు తప్పనిసరి. కానీ ఇక్కడ పంచాయతీ రాజ్ యాక్ట్‌ను పూర్తిగా తుంగలో తొక్కారు. ఈ అక్రమ లేఅవుట్లపై నిఘా పెట్టాల్సిన జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం అక్రమార్కులకు వరంగా మారింది. అధికారుల అండదండలతోనే ఈ రియల్ మాఫియా ఫార్మ్ ల్యాండ్ వెంచర్ల ముసుగులో అమాయక కస్టమర్ల జేబులకు చిల్లు పెడుతోందని స్థానికులు మండిపడుతున్నారు.

**'ఐటీ' దాడులు జరగాల్సిందే.. క్రిమినల్ కేసులు నమోదు చేయాలి!**
నిబంధనల ప్రకారం వ్యవసాయ భూములను











కమర్షియల్ ప్లాట్లుగా మార్చి విక్రయించినప్పుడు, ఆయా లావాదేవీలపై పక్కాగా ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ 'శ్రీకారం' సంస్థ ప్రతి విక్రయం వెనుక కోట్ల రూపాయల నల్లధనాన్ని చేతులు మార్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఆదాయపు పన్ను శాఖ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి, ఈ సంస్థ ఇప్పటివరకు జరిపిన అంతర్గత లావాదేవీలు, కొనుగోలుదారులకు ఇచ్చిన తాత్కాలిక రశీదులను క్షుణ్ణంగా పరిశీలించి, ఈ సంస్థ కార్యాలయాలపై ఆకస్మిక దాడులు నిర్వహించాలని, పన్నుల ఎగవేతపై భారీ జరిమానా విధించడంతో పాటు, ప్రభుత్వ ఖజానాను నిలువునా ముంచినందుకు ఈ ముఠాపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# హైడ్రా చట్టానికి అతీతం కాదు



**హైదరాబాద్, మహా :** హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీరుపై హైకోర్టు మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా చట్టానికి అతీతం ఏమీ కాదని తేల్చి చెప్పింది. ఓ స్థలానికి సంబంధించి తాము ఆదేశాలు ఇచ్చినా హైడ్రా అధికారులు అందులోకి ప్రవేశించడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. ఆ భూమి ప్రభుత్వానిది అని నిరూపించడంలో విఫలమైన తర్వాత కూడా అక్కడికి ఎందుకు వెళ్లారని ప్రశ్నించింది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసమే హైడ్రా పరిమితమని తేల్చి చెప్పింది.
రంగారెడ్డి జిల్లా మల్కాజిగిరి మండలం లోతుకుంట ప్రాంతంలోని సర్వే నంబర్ 1, 2 లో ఉన్న భూమికి సంబంధించిన యజమాన్య స్వాధీన హక్కులను రక్షిస్తూ తాము ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినా ప్రైవేట్ ఆస్తిలోకి వెళ్లినందుకు హైడ్రా కమిషనర్ తీరుపై హైకోర్టు మండిపడింది. హైకోర్టు ఉత్తర్వులను హైడ్రా బహిరంగంగా ఉల్లంఘించిందని, హైడ్రా ప్రత్యేక విభాగంగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని తీవ్రంగా వ్యాఖ్యానించింది. కానీ హైడ్రా కూడా చట్టానికి అతీతులు కాదని.. పరిపాలనా వ్యవస్థలో ఒక భాగమేనని కోర్టు స్పష్టం చేసింది. చట్టపరిధిని దాటి వ్యవహరించే అధికారం హైడ్రా అధికారులకు లేదని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఇక నుంచి ఆ భూమిలోకి ప్రవేశించబోమని హైడ్రా తరపు లాయర్ కోర్టుకు హామీ ఇవ్వడంతో.. దాన్ని ఉల్లంఘించొద్దంటూ.. కోర్టు హైడ్రా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ఆ భూమి యజమాని హైడ్రాపై దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణను హైకోర్టు ముగించింది.
లోతుకుంట గ్రామ పరిధిలోని భూమికి సంబంధించిన విషయంలో శాంతా శ్రీరామ్ అనే నిర్మాణ సంస్థ దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్లపై హైకోర్టు విచారణ జరిపింది. ఆ భూ వివాదానికి సంబంధించి.. రిట్ అప్పీల్, సివిల్ సూట్, ఫస్ట్ అప్పీల్ వంటి కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రాకపోయినా ఆ భూమిలోకి హైడ్రా అధికారులు ప్రవేశించి, జోక్యం చేసుకున్నారని పిటిషనర్ ఆరోపించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందించిన హైడ్రా లాయర్.. సొసైటీ టు సేవ్ రాక్స్ నుంచి వచ్చిన ఫిర్యాదు ఆధారంగా హైడ్రా అధికారులు ఆ స్థలాన్ని సందర్శించినట్లు వివరణ ఇచ్చారు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న జడ్జి.. ఆ భూమి తమదేనని నిరూపించడంలో ప్రభుత్వం విఫలం అయిందని తెలిపారు. అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి ఆ భూమిపై ఎలాంటి హక్కు లేదని.. హైడ్రా అధికారులు ప్రైవేట్ భూమిలోకి ప్రవేశించడం న్యాయపరంగా సరైంది కాదని తేల్చి చెప్పారు. హైడ్రా ఏర్పాటు ఉత్తర్వులను పరిశీలించిన హైకోర్టు జడ్జి.. రోడ్లు, కాలువలు, చెరువులు, పార్కులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకే హైడ్రా పరిమితమని తేల్చిచెప్పారు.

# టీజీ టీ20 టోర్నమెంట్‌పై వివాదం

- హీరో విజయ్ దేవరకొండకు లీగల్ నోటీసులు
- భట్టి, జూపల్లి కొడుకులకు టోర్నమెంట్ తో ఏం సంబంధం?

**హైదరాబాద్, మహా :** సినీ నటుడు విజయ్ దేవరకొండ, వెంకటేష్ దగ్గుపాటి, మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, క్రికెటర్లు సిరాజ్, తిలక్ వర్మలకు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ లీగల్ నోటీసులు పంపింది. హెచ్ సీఏ నిర్వహిస్తున్న టీజీ20 టోర్నమెంట్‌కి పర్మిషన్ లేదని టీసీఏ స్పష్టం చేసింది. టీజీ 20 టోర్నమెంట్‌కి ఎండార్స్‌మెంట్ చేసేముందు, ఆ టోర్నమెంట్‌కి పర్మిషన్ ఉందో.. లేదో తెలుసుకోవాలని టీసీఏ జనరల్ సెక్రటరీ సూచించారు. లేకుంటే ఫ్యూచర్‌లో లీగల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. టోర్నమెంట్ అనౌన్స్‌మెంట్ చేసే 45 రోజుల ముందు బీసీసీఐ నుంచి అనుమతి తీసుకోవాలని, సుప్రీం కోర్టు నిబంధనలు పాటించకుండా టోర్నమెంట్ నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదవుతాయని తెలిపారు. అప్రూవల్ లేని టోర్నమెంట్‌లో తిలక్ వర్మ, సిరాజ్‌లు ఆడమని బీసీసీఐ పర్మిషన్ ఇచ్చిందా? ఎండార్స్‌మెంట్ చేసేముందు ఈ టోర్నమెంట్ లీగలా.. కాదా అనేది చూసుకోవాలని చెప్పారు. ఖమ్మం టీమ్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొడుకుకు ఏం సంబంధమని ప్రశ్నించారు. వరంగల్ టీంలో జూపల్లి కృష్ణారావు కొడుకుకి ఏం సంబంధం అని తెలిపారు. హెచ్ సీఏ నిర్వహిస్తున్న టీజీ 20 ఫ్రాడ్ టోర్నమెంట్ అని, హెచ్ సీఏ లీగల్ ఫీజులకు ఐదారు కోట్లు ఖర్చు పెడుతుందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆరోపించింది. ఈ డబ్బులతో గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ డెవలప్ చేయొచ్చని తెలిపింది.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్ రేవంత్ మార్క్ విద్యా విప్లవం

( మొదటి పేజీ తరువాయి )



వంట గదిలో పూరీలు చేసిన సీఎం అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. స్కూల్ గ్రౌండ్‌లో వారితో సరదాగా ఫుట్ బాల్ ఆడి సందడి చేశారు.

**చదువే మన భవిష్యత్తు పెట్టుబడి**
ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారిని తక్కువ చేసి చూసే పరిస్థితి మారాలని, అక్కడి నుంచే డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉద్భవించాలన్నదే తన లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలు మాత్రమే ప్రజల భవిష్యత్తును మార్చలేవని, పిల్లలు ఉన్నత చదువులు చదివినప్పుడే తల్లిదండ్రులు ఆత్మగౌరవంతో బతుకుతారని ఆయన హితవు పలికారు. దేశాన్ని ఏలిన గొప్ప గొప్ప నాయకులు, సాక్షాత్తూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం విద్యార్థులకు గుర్తుచేసి వారిలో ఆత్మవిశ్వాసం నింపారు. విద్యపై పెట్టే ప్రతి రూపాయిని భవిష్యత్తు పెట్టుబడిగా ప్రభుత్వం భావిస్తోందని వెల్లడించిన ఆయన, రాష్ట్ర బడ్జెట్ లో ఉన్న మూడు లక్షల కోట్లకు పైగా నిధులలో ఏకంగా 8 శాతానికి పైగా, అంటే సుమారు 26 వేల కోట్ల రూపాయలను కేవలం విద్యాశాఖ పైనే ఖర్చు చేస్తున్నామని సగర్వంగా ప్రకటించారు.

**ఆరుట్ల వీరుల స్ఫూర్తితో**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అలుపెరగని పోరాటం చేసిన వీరులు ఆరుట్ల రామచంద్రా రెడ్డి, ఆరుట్ల కమలాదేవిల పాత్ర చిరస్మరణీయమని, ఆ మహనీయుల స్ఫూర్తితోనే ఆరుట్ల గ్రామంలో ఈ ప్రతిష్టాత్మక పాఠశాలను నిర్మించినట్లు సీఎం వివరించారు. ఈ పాఠశాలలో ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాబోధన సాగుతుండగా, రికార్డు స్థాయిలో 1814 మంది విద్యార్థులు చేరడం ప్రభుత్వ పాఠశాలల పట్ల మారుతున్న దృక్పథానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ బడి గేటు బయట 'సీట్లు ఖాళీ లేవు.. అడ్మిషన్లు పూర్తయ్యాయి' అనే బోర్డు పెట్టే అద్భుతమైన పరిస్థితి రావడం పట్ల ఉపాధ్యాయులను, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. విద్యతోనే సమాజంలో మార్పు రావాలని, అంటరానితనం, అసమానతలను పారద్రోలాలన్న లక్ష్యంతో కులమతాల అడ్డుగోడలు బద్దలుకొడుతూ 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల' నిర్మాణానికి ప్రభుత్వం నడుం బిగించిందని ఆయన స్పష్టం చేశారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో కిట్లు**
ప్రభుత్వ బడుల విద్యార్థులకు అందించే స్కూల్ కిట్ల విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడటం లేదని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. విద్యార్థులకు అత్యంత నాణ్యమైన స్కూల్ డ్రెస్సులు, షూలు, సాక్సులు, దుప్పట్లు, స్కూల్ బ్యాగులతో కూడిన కిట్లను అంతర్జాతీయ స్థాయి సంస్థలతో రూ. 688 కోట్లతో తయారు చేయిస్తున్నామని, జూలై ఆఖరు నుంచి వీటి పంపిణీ చేపడతామని ప్రకటించారు. మరోవైపు యువతను నిర్వీర్యం చేస్తున్న మాదక ద్రవ్యాల మహమ్మారిపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందన్నారు. ఈ దురలవాట్ల పట్ల విద్యార్థులను చైతన్యవంతం చేసేందుకు ఈ నెల 19వ తేదీన హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియం వేదికగా రాష్ట్ర గవర్నర్ సమక్షంలో వేలాది మంది విద్యార్థులతో డ్రగ్స్ కు వ్యతిరేకంగా భారీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి తదితర మత్తు పదార్థాలు వాడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విద్యార్థులను కోరారు.
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) లాంటి ఆధునిక సాంకేతికతల రాకతో ప్రపంచవ్యాప్తంగా వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, యువతకు ప్రత్యేక నైపుణ్యాలు నేర్పించి 'బ్లూ కాలర్' ఉద్యోగాలు కల్పించాలనే సమున్నత ఆశయంతోనే రాష్ట్రంలో 'స్కిల్స్ యూనివర్సిటీ'ని నెలకొల్పామని సీఎం తెలిపారు. ప్రారంభించిన తొలి ఏడాదే యువతకు అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం సంతోషకరమన్నారు. అలాగే క్రీడా రంగానికి కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. 140 కోట్ల జనాభా ఉన్న మన దేశం ఒలింపిక్స్ లో కనీసం ఒక్క స్వర్ణ పతకం కూడా సాధించలేకపోవడం ఆవేదన కలిగిస్తోందని, ఈ పరిస్థితిని మార్చి మన యువతలో ఒలింపిక్ స్ఫూర్తిని రగిలించేందుకే పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యంతో 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ప్రారంభించామన్నారు. క్రీడాకారుల్లో మరింత స్ఫూర్తిని నింపడానికే సాక్షాత్తూ ఫుట్ బాల్ ప్రపంచ దిగ్గజం లియోనెల్ మెస్సీని హైదరాబాద్ కు రప్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆరుట్ల మోడల్ స్కూల్‌ను ఒక పాఠంగా తీసుకుని రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మరింత అద్భుతంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, విద్యాకమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి తదితరులు పాల్గొన్నారు.



# సాయికృష్ణ లాకప్ డెత్ పై పవన్ ఆగ్రహం

**విచారణకు చంద్రబాబు ఆదేశం**

అమరావతి, మహా : విజయవాడలో కృష్ణలంక పోలీసులపై సాయికృష్ణ అనే రౌడీ షీటర్ ను లాకప్ డెత్ చేయడమే కాకుండా అతని శవాన్ని కాల్చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఇప్పటికే ఇందుకు కారణమైన కృష్ణలంక పీఎస్ సీఐ నాగరాజుని వీఆర్ కు పంపింది. కాపు సామాజిక వర్గానికి చెందిన సాయికృష్ణపై ఇలా లాకప్ లో జరిగిన హత్యపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బుధవారం సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. సింగపూర్ పర్యటన ముగించుకుని సచివాలయానికి చేరుకున్న చంద్రబాబు.. వెంటనే పోలీస్ ఉన్నతాధికారులను పిలిపించుకున్నారు. సాయికృష్ణ అదృశ్యం ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ తో కలిసి సమీక్షించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు పోలీస్ ఉన్నతాధికారులు వివరించారు. ఈ ఘటనపై పవన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సాయికృష్ణ ఘటనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజుపై చర్యలకు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారు. లాకప్ డెత్ కు కారణమైన సీఐ నాగరాజును సస్పెండ్ చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. సాయికృష్ణ అదృశ్యం ఘటనపై సీనియర్ ఐపీఎస్ అధికారితో దర్యాప్తునకు సీఎం నిర్ణయించారు. సాయికృష్ణ ఘటనపై నిష్పాక్షపాతంగా దర్యాప్తు జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా, విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు కూడా పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే



**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే అబద్ధాన్ని నిజం చేయాలని చూస్తూ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీద, కేంద్ర ప్రభుత్వం మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరుతూ నిన్న కిషన్ రెడ్డికి సీఎం లేఖ రాయడం అత్యంత హాస్యాస్పదమని ధ్వజమెత్తారు. రెండున్నరేళ్లలో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి 71 సార్లు వెళ్లారని, కనీసం 15 సార్లు కేంద్రమంత్రులను కలిశారని గుర్తు చేశారు. అర్బన్ డెవలప్‌మెంట్, మెట్రో అంశాలపై కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ను 5 సార్లు, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ని 3 సార్లు కలవడమే కాకుండా, హైదరాబాద్‌లో కూడా పలుమార్లు సమావేశమైన రేవంత్ రెడ్డి ఆ సందర్భాల్లో ఎప్పుడైనా కిషన్ రెడ్డికి చెప్పి కలిశారా? అని ప్రశ్నించారు. ప్రధానమంత్రిని పలుమార్లు కలిసిన ముఖ్యమంత్రి, కేంద్రమంత్రులను కలవడానికి అడ్డంకులు ఉన్నాయని చెప్పడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. ఇప్పుడు మాత్రం అపాయింట్‌మెంట్ ఇప్పించడం లేదంటూ కిషన్ రెడ్డిపై ఆరోపణలు చేయడం రాజకీయ నాటకం, బూటకమేనని మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదారి పట్టించేందుకే రేవంత్ రెడ్డి లేఖ రాశారని దుయ్యబట్టారు. తన వైఫల్యాలన్నింటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి కొత్త డ్రామాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిపై ఆసక్తి లేదని, ఆ పార్టీకి కేవలం స్కాములు, కమీషన్ల రాజకీయాలపైనే అనుభవం ఉందని రాంచందర్ రావు ఎద్దేవా చేశారు. 2జి స్కామ్, అగస్టా వెస్ట్‌ల్యాండ్ స్కామ్ లు కాంగ్రెస్ చరిత్ర అని విమర్శించారు.
కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రాజెక్టులను ఎలా ప్రతిపాదించాలో కూడా తెలియదని, మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీఫీజిబిలిటీ రిపోర్టు, ఫైనాన్షియల్ ఫీజిబిలిటీ రిపోర్టు, డీపీఆర్ లను ఇప్పటి వరకు సమర్పించలేదని విమర్శించారు. అవసరమైన సాంకేతిక పత్రాలు ఇవ్వకుండా కేంద్రం అడ్డుకుంటోందని చెప్పడం ముమ్మాటికీ అవాస్తవమని తెలిపారు.
మెట్రో ఫేజ్ 2కు కేంద్రం వ్యతిరేకం కాదని, ఎప్పుడూ ప్రాజెక్టును తిరస్కరించలేదని స్పష్టం చేశారు. ఇది కేంద్రం చేసిన 'రిజెక్షన్' కాదు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల జరిగిన డిలే మాత్రమేనని తేల్చిచెప్పారు. రుణాల చెల్లింపుల కంటే ముందు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ అంశంపై, ప్రాజెక్టు నిర్వహణపై స్పష్టత ఇవ్వాలని కేంద్రం సూచించిన సలహాలు పాటించకుండా, ఇప్పుడు కేంద్రంపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు.

# గుడివాడ అమర్నాథ్ అరెస్టుకు రంగం సిద్ధం

**అనిత మేకప్ పై వ్యాఖ్యలు.. రాష్ట్రవ్యాప్తంగా కేసులు**

**అమరావతి బ్యూరో, మహా:** ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత మేకప్ పై వ్యాఖ్యలు చేసిన వైఎస్సార్సీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అరెస్టుకు రంగం సిద్ధమవుతోంది. అమర్నాథ్ వ్యాఖ్యలపై ఇప్పటికే టీడీపీ, జనసేనతో పాటు బీజేపీ మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయనపై మహిళా కమిషన్ తో పాటు పలు చోట్ల కూటమి పార్టీల కార్యకర్తలతో కేసులు పెట్టిస్తున్నారు. వీటి ఆధారంగా అమర్నాథ్ ను అరెస్టు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఇవాళ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ కు పలువురు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు.ఎన్టీఆర్, పల్నాడు జిల్లాలకు చెందిన మహిళా నేతలు.. అమర్నాథ్ వ్యాఖ్యలు ఒక మహిళా ప్రజాప్రతినిధి గౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నాయంటూ కమిషన్ ను ఆశ్రయించారు. దీనిపై మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ స్పందించారు. మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తామన్నారు. ఫిర్యాదును పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రాష్ట్రంలో మరికొన్ని చోట్ల ఫిర్యాదులు వస్తున్నాయి. మరోవైపు గుడివాడ అమర్నాథ్ పై కూటమి నేతలు చేస్తున్న ప్రచారం, ఫిర్యాదులపై వైఎస్సార్సీపీ నేత పేర్ని నాని తీవ్రంగా స్పందించారు. గుడివాడ అమర్నాథ్ కేవలం మేకప్ గురించి మాట్లాడితే కట్టు, బొట్టూ అంటూ కూటమి నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. హోంమంత్రిగా ఉన్న అనిత గతంలో జగన్ కుటుంబ సభ్యుల గురించి, మహిళల గురించి చేసిన వ్యాఖ్యల వీడియోల్ని బయటపెట్టారు.

# ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

**పాల్గొన్న ఎమ్మెల్యే, కుడా చైర్మన్,డిసిసి అధ్యక్షులు ఇనగాల**



హనుమకొండ మహా ;హనుమకొండ జిల్లాలోని వర్ధన్నపేట నియోజకవర్గం హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ఇళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి నిరుపేదకు సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. లబ్ధిదారుల గృహప్రవేశాల పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుడి ఇంట్లో ఎక్సైజ్ పోలీసుల సోదాలు

**భారీగా విదేశీ మద్యం పట్టివేత**

**కుషాయిగూడ , మహా :** జవహర్ నగర్ లోని ఓ ప్రముఖ కాంగ్రెస్ నాయకుడి ఇంట్లో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. 500 వరకు విదేశీ మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటన జవహర్ నగర్ బాలాజీనగర్ లో చోటుచేసుకుంది. మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... జవహర్ నగర్ బాలాజీనగర్ లో నివాసముండే ఓ ప్రధాన పార్టీకి చెందిన నాయకుడు, అతని సోదరుడు విదేశాల నుంచి మద్యం బాటిళ్ళను నిబంధనలకు విరుద్ధంగా తీసుకువచ్చి అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసులు బుధవారం సోదాలు చేశారు. సుమారు 500 వరకు విదేశీ, ఆర్మీ బాటీళ్ళను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమ మార్గంలో మద్యం బాటిళ్ళను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న నిందితులపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. కాంగ్రెస్ నేతతో పాటు మరో పాయి చెందిన సోదరుడి ఇంట్లో కూడా దాడులు చేశారని సమాచారం. ఈ ఘటనపై మల్కాజిగిరి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ను ఫోన్లో సంప్రదించగ స్పందించలేదు.

# ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై పెట్రోల్ బాంబు దాడి

- **జార్ఖండ్ లో ని నివారణ్ పూర్ లో ఘటన**
- **ఒక బాంబు గాల్లోనే పేలిపోగా, మరో బాంబు పేలలేదు**
- **ఘోర ప్రమాద తప్పిందంటున్న పోలీసులు**



**రాంచీ, మహా :** జార్ఖండ్ రాజధాని రాంచీలోని నివారణ్‌పూర్‌లో ఉన్న ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ కార్యాలయంపై కొందరు గుర్తుతెలియని దుండగులు పెట్రోల్ బాంబులతో దాడికి ప్రయత్నించారు. బుధవారం తెల్లవారుజాము దాదాపు 12.36 గంటల సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని పెట్రోల్ బాంబులు విసిరి అక్కడి నుంచి వేగంగా పరారయ్యారు. ఇద్దరు గుర్తు తెలియని దుండగులు ఆర్ఎస్ఎస్ ఆఫీసుకు సమీపంలోకి కారుతోపాటు బైకుపై వచ్చారు. కొంతదూరంలో తమ వాహనాల్ని ఆపేసి, ఆఫీసు వద్దకు నడుచుకుంటూ వచ్చారు. ఆఫీస్ వద్దకురాగానే రెండు పెట్రోల్ బాంబులు తీసి, వాటిని వెలిగించి విసిరేశారు. అయితే, ఒక పెట్రోల్ బాంబు గాల్లోనే పేలిపోయింది. మరోటి పేలకుండానే కిందపడిపోయింది. దీనిలోని పెట్రోల్ అంతా ఒలికిపోయింది. దీంతో ఈ ఘటనలో ఎలాంటి నష్టం సంభవించలేదు. సాధారణంగా పెట్రోల్ బాంబుల పేలుడుతో మంటలు భారీగా అంటుకుంటాయి. కానీ, ఈ బాంబులు సరిగ్గా పేలకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ దాడికి సంబంధించిన దృశ్యాలన్నీ కార్యాలయం బయట అమర్చిన సీసీటీవీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. ఈ సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా స్థానిక పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

**ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి**

ఈ ఘటనపై కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత సంజయ్ సేథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాంచీలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు జరిగిన ఓ పెద్ద కుట్రగా ఆయన దీనిని అభివర్ణించారు. దుండగులు విసిరిన మొదటి పెట్రోల్ బాంబు గాల్లోనే పేలిపోగా, రెండోది భూమిపై పడి పగిలిందని, అయితే ప్రమాదవశాత్తూ అందులోని పెట్రోల్ మంటలు వ్యాపించకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఆయన వివరించారు. ఘటన జరిగిన సమయంలో ఆఫీసులోపల అనేక బైకులు పార్క్ చేసి ఉన్నాయని, లోపల ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఉన్నారని, ఒకవేళ మంటలు అంటుకుని ఉంటే భారీ నష్టం జరిగేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాంచీ ఆర్ఎస్ఎస్ కార్యాలయం వద్ద శాశ్వత పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాంచీలో అల్లర్లు సృష్టించేందుకే ఈ దాడి చేశారని ఆరోపించారుమరోవైపు జార్ఖండ్ అసెంబ్లీ ప్రతిపక్ష నేత బాబూలాల్ మరాండీ కూడా ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏదో పెద్ద వినాశనానికి లేదా కుట్రకు జరిగిన ముందస్తు ప్రయత్నంగా కనిపిస్తోందని, దీనిని సాధారణ ఘటనగా కొట్టిపారేయలేమని స్పష్టం చేశారు. ఈ ఘటనను తేలిగ్గా తీసుకోకూడదని, తీవ్రంగా పరిగణించాలని ఆయన సూచించారు. ఈ విషయంపై రాంచీ డీఎస్పీ కేవీ రమన్ స్పందిస్తూ ఘటనా స్థలం నుంచి రెండు సీసాలను స్వాధీనం చేసుకున్నామని, ఎఫ్ఎస్ఎల్ బృందం వాటిని పరిశీలిస్తోందని వెల్లడించారు. ఈ వ్యవహారం సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని, నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకోవడానికి సైబర్ డీఎస్పీ సహా పలువురు ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక బృందం నిందితుల కోసం గాలిస్తోందని, త్వరలోనే వారిని పట్టుకుంటామని స్పష్టం చేశారు. అలాగే, ఆర్ఎస్ఎస్ కార్యాలయం వద్ద భద్రతను కూడా కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనతో రాంచీలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది



# హనుమకొండలో పర్యటించిన పవన్ కళ్యాణ్

- **సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన ఏపీ డిప్యూటీ సీఎం**
- **సోషల్ మీడియాలో సుదీర్ఘ పోస్ట్ చేసిన జనసేనాని**

హైదరాబాద్, మహా : ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమానిని పరామర్శించేందుకు ఆయన బుధవారం హనుమకొండకు వెళ్లారు. పర్యటన ముగిసిన అనంతరం, తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ చేశారు. కొన్ని రోజుల క్రితం హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు, తాను ఓ అరుదైన వ్యాధితో పోరాడుతున్నానని, తన అభిమాన నటుడు పవన్ కళ్యాణ్‌ను కలవడమే తన కోరిక అని పేర్కొంటూ ఓ వీడియో విడుదల చేశాడు. ఆ వీడియో పవన్ దృష్టికి చేరింది. దీంతో వెంటనే స్పందించిన ఆయన, అభిమాని ఆకాంక్షను నెరవేర్చాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఈరోజు నేరుగా హనుమకొండలోని నిరంజన్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ నిరంజన్ ప్రదర్శిస్తున్న ధైర్యం, ఆత్మవిశ్వాసం తనను ఎంతగానో కదిలించిందని పవన్ పేర్కొన్నారు. "అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో నిరంజన్ అసాధారణ ధైర్యం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు ఎంతో స్ఫూర్తిదాయకం. అతని మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనికి ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను" అని పవన్ తన పోస్టులో వివరించారు. ఈ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, తనకు పూర్తి సహకారం అందించిన తెలంగాణ ప్రభుత్వానికి పవన్ కళ్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "నా వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసు శాఖలోని ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వారి అభిమానం తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తుందని, వారి మమకారాన్ని జీవితాంతం తన హృదయంలో నిలుపుకొంటానని పవన్ భావోద్వేగంగా రాశారు. చివరగా "ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో చూడాలని కోరుకుంటున్నాను" అంటూ అభిమానికి భరోసా ఇచ్చారు.



# మోదీపై ట్రంప్ ప్రశంసల జల్లు

- **ఫ్రాన్స్ జీ-7 సదస్సులో అనూహ్య పరిణామాలు**
- **ఆయనెంతో ప్రశాంతం.. నేను అలా కాదు.**

**ఫ్రాన్స్, మహా.:** ఫ్రాన్స్ వేదికగా జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచ దేశాల అగ్రనేతలు పాల్గొన్న 'వర్కింగ్ లంచ్' సందర్భంగా మోదీ వ్యక్తిత్వాన్ని, ఆయన పనితీరును కొనియాడుతూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ వేదికపై విశేషంగా ఆకర్షించాయి. ప్రధాని మోదీ ఎంతో ప్రశాంతంగా, కూల్‌గా ఉంటారని, అయితే కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనొక 'టోటల్ కిల్లర్' అని ట్రంప్ అభివర్ణించారు. తాను మోదీ లాగా అంత నిశ్చలంగా ఉండలేనని, తన దూకుడు స్వభావానికి, మోదీ నిశ్చల వైఖరికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ట్రంప్ ఈ సందర్భంగా చమత్కరిస్తూ పోల్చి చెప్పారు. ఒకసారి ఆయన్ను చూడండి ఎంత ప్రశాంతంగా ఉన్నారో అంటూ తోటి నేతలనుద్దేశించి వ్యాఖ్యానించారు. మరోవైపు, జీ7 సదస్సు వేదికగా ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య జరగనున్న ద్వైపాక్షిక భేటీ కోసం ఇరు దేశాల ప్రతినిధులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సమావేశంపై అమెరికా ప్రతినిధి సెర్గియో గోర్ స్పందిస్తూ, ప్రధాని మోదీని కలవడం ఎప్పుడూ ఆనందదాయకమైన విషయమేనని పేర్కొన్నారు. వీరిద్దరి అత్యున్నత స్థాయి సమావేశం కోసం తాము ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నామని ఆయన వెల్లడించారు. సదస్సు వేదికగా ఇరు దేశాధినేతల మధ్య నెలకొన్న ఈ సానుకూల వాతావరణం భారత్‌అమెరికా దౌత్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు

# ఒప్పందం నచ్చకపోతే మళ్లీ బాంబులేస్తాం

**.. ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్**

**మహా :** అమెరికాఇరాన్ మధ్య నెలల తరబడి కొనసాగిన ఉద్రిక్తతలకు ముగింపు పలికే ఒప్పందం కుదిరే దశలో ఉన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఒప్పంద ముసాయిదా తనకు నచ్చకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభిస్తామని హెచ్చరించారు. దీంతో ఇప్పటికే సున్నితంగా ఉన్న పశ్చిమాసియా పరిస్థితులపై మరోసారి దృష్టి కేంద్రీకృతమైంది. ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్ సిసితో కలిసి మీడియాతో మాట్లాడిన ట్రంప్.. అమెరికాఇరాన్ మధ్య కుదరబోయే ఒప్పందం ఇంకా తుది రూపం దాల్చలేదని చెప్పారు. ప్రస్తుతం అది కేవలం అవగాహన ఒప్పందం మాత్రమేనని పేర్కొన్నారు. ‘‘ఆ ఒప్పందం నాకు నచ్చకపోతే మళ్లీ వారిపై కాల్పులు జరుపుతాం. వారి తలలపై బాంబులు వేయడం మొదలుపెడతాం’’ అంటూ ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్ ప్రవర్తన సరిగా లేకపోయినా అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలు మళ్లీ అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించాయి.

# అనితకు మేకప్ మీద ఉన్న ప్రేమ మనుషుల ప్రాణాల మీద లేదు

**యాంకర్ శ్యామల ఫైర్**



తాడేపల్లి, మహా : ఏపీ హోంమంత్రి అనితపై వైసీపీ అధికార ప్రతినిధి, బుల్లితెర యాంకర్ శ్యామల తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన శ్యామల, “హోంమంత్రి అనితకు మేకప్ మీద ఉన్న ప్రేమ మనుషుల ప్రాణాల మీద లేదు” అని వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్వరి, సాయికృష్ణ కేసులపై హోంమంత్రి ఎందుకు మాట్లాడటం లేదని శ్యామల ప్రశ్నించారు. “సాయికృష్ణ మీద కేసులుంటే అతన్ని లాకప్ డెత్ చేస్తారా? ఇంకా ఎక్కువ కేసులున్న టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు ఎందుకు అదే ట్రీట్‌మెంట్ ఇవ్వడం లేదు?” అని నిలదీశారు. హోంమంత్రి అనిత మహిళల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని, అధికార మదంతో ఇష్టానుసారం మాట్లాడుతున్నారని శ్యామల ఆరోపించారు. వైసీపీ అధినేత జగన్, ఆయన కుటుంబ సభ్యులపై అనిత అత్యంత నీచంగా మాట్లాడారని విమర్శించారు. “మేము ఏదైనా మాట్లాడితే మహిళకు అవమానం అంటూ రచ్చ చేస్తారు. ఇవేనా మీ ఎల్లో మీడియా, ఐటీడీపీ చేసే నీచ రాజకీయాలు?” అని ప్రశ్నించారు. హోంమంత్రి బాధ్యత మహిళలకు రక్షణ కల్పించడమని, దాన్ని వదిలేసి నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాకినాడలో చిన్నారి మిస్సింగ్ కేసుపై కూడా హోంమంత్రి స్పందించడం లేదని దుయ్యబట్టారు.

# ఆదిభట్లలో నేడు విద్యుతుకు అంతరాయం...!

**ప్రజలు సహకరించాలన్న ఏఈ జయన్న..**

**ఇబ్రహీంపట్నం జూన్ 17 మహా:** ఆదిభట్ల సబ్ స్టేషన్ పరిధిలోని కాలనీలలో నేడు కరెంటు అంతరాయం కలగనున్నట్లు ఆదిభట్ల విద్యుత్ ఏఈ జయన్న తెలిపారు. టిజిఎస్పీడీసీఎల్ ఆదిభట్ల విద్యుత్ పరిధిలో, విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను నేడు తొలగించనున్న సందర్భంలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు, సాయి కుటీర్ విల్లాస్, జనప్రియ అపార్ట్మెంట్, ఎస్ఎస్ జనిత్ అపార్ట్మెంట్, వసంత కార్పొరేషన్, సాయితేజ ఎలైట్ అపార్ట్మెంట్, సాయి తేజ అపార్ట్మెంట్ (కమర్షియల్), అగస్త్య కాలేజ్, ఐసిఐసిఐ బ్యాంక్, RRR అపార్ట్మెంట్, కేపిఎన్ సూపర్ మార్కెట్, పోలీస్ స్టేషన్, శ్రీశ్రీ ఏరోసిటీ, ఎలిగేంట్ ఇన్ఫ్రా, ఎస్సార్ కాలేజ్, శ్రీచైతన్య కాలేజ్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు టిజిఎస్పీడీసీఎల్ ఆదిభట్ల విద్యుత్ ఏఈ జయన్న తెలిపారు.

# మోదీ పాలన.. ప్రగతికి సోపానం!

- **వికసిత తెలంగాణే భాజపా లక్ష్యం.**
- **అభివృద్ధిలో దేశం.. ఆత్మనిర్భరతలో ఖమ్మం!**
- **కాంగ్రెస్, భారాసలది మోసపూరిత పాలన.**
- **భాజపా జాతీయ నాయకులు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కో-ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి.**
- **ఖమ్మం రైల్వే స్టేషన్లో ఫోటో ఎగ్జిబిషన్ పరిశీలన.**



**ఖమ్మం, మహా :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో గడిచిన పన్నెండేళ్లలో దేశం మున్నెన్నడూ చూడని రీతిలో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని భాజపా జాతీయ నాయకులు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కోఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం ఖమ్మం రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మోదీ 12 ఏళ్ల సుపరిపాలన ఫోటో ఎగ్జిబిషన్‌ను బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం లక్షల కోట్లు కేటాయించిందని, అయితే రాష్ట్రంలోని కాంగ్రెస్, గత భారాస ప్రభుత్వాలు ప్రజలను మాయమాటలతో మోసం చేశాయని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**పన్నెండేళ్ల ప్రగతి ప్రస్థానం:**

భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు ఈ నెల 5 నుంచి 21వ తేదీ వరకు మోదీ 12 ఏళ్ల సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ దేశవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు పొంగులేటి తెలిపారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కేంద్రం సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఎన్డీయే ప్రభుత్వ పాలన "విశ్వాసం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం" అనే మూడు మూలస్తంభాలపై నిలబడి ఉందని స్పష్టం చేశారు. రైతులు, పేదలు, యువత, మహిళల సాధికారత కొరకు నాలుగు ప్రాధాన్యతా రంగాలుగా విభజించి పని చేస్తున్నామని చెప్పారు. మోదీ నాయకత్వంలో నేడు భారతదేశం ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోందని, పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చిన ఘనత ఎన్డీయే ప్రభుత్వానిదేనని కొనియాడారు. ఉజ్వల యోజన ద్వారా 12 కోట్ల మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా 12 కోట్ల మంది రైతులకు ఆర్థిక సాయం అందించామని గుర్తు చేశారు. కరోనా విపత్కర సమయంలో స్వదేశీ వ్యాక్సిన్లు తయారు చేసి ప్రపంచానికి ఎగుమతి చేసిన ఆత్మనిర్భర్ భారత్ మనదని గర్వంగా చెప్పారు.

**తెలంగాణ అభివృద్ధికి కేంద్రం దన్ను:**

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం సుమారు ₹3 లక్షల కోట్లకు పైగా నిధులను మంజూరు చేసిందని సుధాకర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర జీఎస్‌డీపీ 201314లో ₹4.3 లక్షల కోట్లు ఉండగా, 202425 నాటికి అది ₹11.1 లక్షల కోట్లకు పెరిగిందని వివరించారు. 2014లో 2,135 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారుల విస్తీర్ణాన్ని నేడు 3,700 కిలోమీటర్లకు పైగా పెంచామని తెలిపారు. రైల్వే ప్రాజెక్టుల కోసం కేంద్రం ₹47,984 కోట్ల పెట్టుబడులు పెడుతోందని స్పష్టం చేశారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని, అందులో భాగంగా ఖమ్మం రైల్వే స్టేషన్ అభివృద్ధికి సుమారు ₹50 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్, రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ, వరంగల్‌లో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు లాంటివి కేంద్రం సాధించిన విజయాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు ₹11,300 కోట్లు, ఆదిలాబాద్‌కు ₹56,000 కోట్లు, మహబూబ్ నగర్‌కు ₹13,500 కోట్లు, వరంగల్‌కు ₹6,100 కోట్లు ప్రత్యేక ప్యాకేజీల కింద కేటాయించామని వివరించారు. భద్రాచలం, రామప్ప లాంటి చారిత్రక ప్రాంతాల అభివృద్ధికి కూడా కేంద్రం నిధులు ఖర్చు చేస్తోందని తెలిపారు.

***కాంగ్రెస్, భారాసలపై ధ్వజం:**

గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. కుటుంబ పాలన, అవినీతి, అహంకారంతో తెలంగాణను భ్రష్టు పట్టించిందని పొంగులేటి విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు, ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువునా మోసం చేస్తోందని మండిపడ్డారు. నేటికీ రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు అనవసరంగా కేంద్రంపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, ఖమ్మం కార్పొరేషన్‌లో కనీస డ్రైనేజీ వ్యవస్థ లేదని, త్రాగునీటి సదుపాయాలు సరిగ్గా లేవని స్థానిక సమస్యలను ఎత్తి చూపారు. "వికసిత్ భారత్ వికసిత్ తెలంగాణ వికసిత్ ఖమ్మం" అనే లక్ష్యంతో రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు భారతీయ జనతా పార్టీ నిరంతరం కృషి చేస్తోందని ఉద్ఘాటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వాస్తవాలు గ్రహించి, అభివృద్ధి ప్రదాత మోదీ గారికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఉజ్వల గ్యాస్, గరీబ్ కళ్యాణ్ తదితర లబ్ధిదారులతో పొంగులేటి సుధాకర్ రెడ్డి నాయకులు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోంగూర వెంకటేశ్వరరావు, రుద్ర ప్రదీప్, రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు, నాయకులు మేకల నాగేందర్, శ్యామ్ రాథోడ్, నున్నా రవి, మంద సరస్వతి, పమ్మీ అనిత, శ్రీరామనేని మణి, నకిరకంటి వీరభద్రం, కొణతం లక్ష్మీ నారాయణ, రవి గౌడ్, జ్వాల నరసింహారావు కందుల శ్రీకృష్ణ, పాలెపు రాము తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి ఫుడ్ పార్క్‌లో భారీ కుంభకోణం

- **శ్వేతపత్రం విడుదల చేయాల్సిందే.**
- **రైతుల నోట్లో మట్టి కొట్టి కార్పొరేట్లకు కట్టబెట్టారా?.**
- **రూ.109 కోట్ల ఫుడ్ పార్క్ అక్రమాలపై సీబీఐ, సీవీసీ దర్యాప్తు జరగాలి.**
- **భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాల కో-ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆగ్రహం**




**సత్తుపల్లి,మహా :** వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి కోసం, స్థానిక రైతులకు అండగా నిలుస్తుందనే ఆశతో ఏర్పాటు చేసిన సత్తుపల్లి మెగా ఫుడ్ పార్క్ చివరకు పెద్ద కుంభకోణానికి వేదికగా మారిందని భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, కర్ణాటకతమిళనాడు రాష్ట్రాల కోఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని ఫుడ్ పార్క్‌ను బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావుతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ జరుగుతున్న వ్యవహారాలను, నిర్మాణాలను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఫుడ్ పార్క్ వ్యవహారంలో పారదర్శకత పూర్తిగా లోపించిందని, ఈ భారీ అక్రమాల వెనుక ఈ ప్రాంతానికి చెందిన ముఖ్య నాయకుల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. మెగా ఫుడ్ పార్క్ స్కీమ్ కింద కోల్డ్ స్టోరేజీతో కూడిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును వ్యవసాయ ఆధారిత ప్రొడక్ట్ ల కోసం, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో రూ.109.50 కోట్ల అంచనా వ్యయంతో రూపకల్పన చేశారని పొంగులేటి గుర్తు చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని కాంక్షించి తన వంతుగా ఏకంగా రూ.49.70 కోట్ల భారీ నిధులను కేటాయించిందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర కేవలం భూములను సేకరించి ఇవ్వడం మాత్రమేనని, కానీ ఆ ప్రక్రియలోనే పాలకులు అత్యంత దారుణమైన అక్రమాలకు తెరలేపారని ఆరోపించారు. స్థానిక రైతుల నుంచి కేవలం లక్ష, రెండు లక్షల రూపాయల చొప్పున అత్యంత తక్కువ ధరకే భూములను గుంజుకుని, ఈ రోజు వాటిని కార్పొరేట్ శక్తులకు యథేచ్ఛగా ధారాదత్తం చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. తమకు సరైన పరిహారం రాకపోయినా, భవిష్యత్తులో ఈ పార్క్ ద్వారా తమ పిల్లలకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయనే పవిత్ర ఆశయంతోనే రైతులు తమ ప్రాణప్రదమైన భూములను ప్రభుత్వానికి అప్పగించారని పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. కానీ చివరకు ఆ నిరుపేద రైతుల ఆశలను అడియాశలు చేస్తూ, పారదర్శకతకు పూర్తిగా పాతరవేశారని మండిపడ్డారు. అసలు ఎలాంటి నియమ నిబంధనలు పాటించకుండా, ఆంధ్రాకు చెందిన ఒక ప్రైవేట్ కంపెనీకి ఏకంగా 84 ఎకరాల భూమిని కేటాయించడం వెనుక ఉన్న అసలు ఆంతర్యం ఏమిటని ఆయన నిలదీశారు. దీనితో పాటు దీపక్ నెక్స్ జెన్ కంపెనీకి మార్కెట్ ధరలో సగానికంటే తక్కువ ధరకే భూములను అప్పగించడం వెనుక ఎవరి హస్తం ఉందో, ఎవరికి ఎంత ముడుపులు ముట్టాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం కేబినెట్ అప్రూవల్ (మంత్రిమండలి ఆమోదం) పొందిన తర్వాతే జరగాల్సిన ఇటువంటి కీలకమైన భూకేటాయింపులు, ఎవరి ప్రమేయంతో, ఎవరి ఒత్తిళ్లతో చట్టవిరుద్ధంగా జరిగిపోయాయో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ఈ ఫుడ్ పార్క్ ఉదంతంలో జరిగిన ప్రతి ఒక్క అక్రమాన్ని బయటకు తీయాల్సిందేనని, ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే దీనిపై పూర్తి వివరాలతో కూడిన శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని పొంగులేటి సుధాకర్ రెడ్డి గట్టిగా డిమాండ్ చేశారు. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారుల ముసుగులు తొలగించి, వారిని సమాజం ముందు నిలబెట్టే వరకు బీజేపీ విశ్రమించబోదని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ద్వారా సమగ్ర దర్యాప్తు చేయిస్తామని, అవసరమైతే కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) చేత కూడా దర్యాప్తు జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామని స్పష్టం చేశారు. తాను ఈ జిల్లా వాసిగా ఇక్కడి రైతులకు జరిగిన అన్యాయాన్ని, దోపిడీని చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, బాధితులకు న్యాయం జరిగే వరకు క్షేత్రస్థాయి నుండి ఢిల్లీ స్థాయి వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. అంతకుముందు సత్తుపల్లి సమీపంలోని గ్రీన్ ఫీల్డ్ హైవేపై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావుతో పాటు రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్ర ప్రదీప్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నలగడ్డ నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు, జిల్లా కార్యదర్శి వీరంరాజు, సత్తుపల్లి మండల, పట్టణ అధ్యక్షులు బానోతు విజయ్, శాలి శివకృష్ణ, వేంసూర్ మండల అధ్యక్షులు గొర్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు పరస రాంబాబు, రఘునాథరెడ్డి, భీమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, బండి వెంకటరెడ్డి, నల్లమోతు నాని బాబు, కొప్పుల మధుసూదన్ రెడ్డి , వేముల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



# బై బై చికాగో

హీరో, హీరోయిన్లు షూటింగ్స్‌తో ఎంత బిజీగా ఉంటారో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఓ వైపు షూటింగ్స్, మరోవైపు ప్రమోషన్స్‌తో ఫుల్ బిజీగా ఉంటుంటారు. షూటింగ్స్‌కి ఏ మాత్రం విరామం దొరికినా చాలు సేద తీరేందుకు విదేశాల్లో వాలిపోతుంటారు. కుటుంబ సభ్యులతోనో, స్నేహితులనో వెకేషన్ ప్లాన్ చేస్తుంటారు. తమకు ఇష్టమైన ప్రదేశానికి వెళ్లి సరదాగా ఎంజాయ్ చేస్తుంటారు.

తమ అనుభూతులను, మధురమైన జ్ఞాపకాలను అభిమానుల కోసం సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ కూడా తాజాగా చికాగో వెకేషన్‌ని పూర్తి చేశారు. వరుణ్ ధావన్ హీరోగా మృణాళ్ ఠాకూర్, పూజా హెగ్డే హీరోయిన్లుగా డేవిడ్ ధావన్ తెరకెక్కించిన చిత్రం 'హై జవానీతో ఇష్క్ హోనా హై'. ఈ నెల 5న ఈ మూవీ విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో బిజీగా పాల్గొన్నారు మృణాళ్.


ఈ మూవీ రిలీజ్ తర్వాత వెకేషన్ కోసం చికాగో వెళ్లారామె. అక్కడ తనదైన శైలిలో సందడి చేసిన ఈ బ్యూటీ తిరిగి ఇండియాకి బయలుదేరారు. ఈ నేపథ్యంలో "బ్యాగులు మొత్తం సర్దేశాను.. చికాగో సిటీని వదిలే సమయం వచ్చింది. నిజం చెప్పా లంటే ప్రాణం పోతున్నట్టుగా ఉంది" అంటూ ఓ ఎమోషనల్ ఎమోజీతో పాటు తన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారామె. ఈ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

# కొత్త తరహా పాత్రలో కనిపించబోతున్నాను: సునీల్



''ఇసాకపట్నం' సిరీస్ చాలా వాస్తవంగా ఉంటుంది. ప్రతి పాత్రకు వారి సొంత లక్ష్యాలు, సంఘర్షణలు ఉంటాయి. ఈ సిరీస్‌లో నేను ఇప్పటి వరకు చేయని కొత్త తరహా పాత్రలో కనిపించబోతున్నాను'' అని సునీల్ పేర్కొన్నారు. ఐశ్వర్యా రాజేష్, సముద్రఖని ప్రధాన పాత్రల్లో, సునీల్, నరేష్ అగస్త్య, రాజీవ్ కనకాల, మెరిన్ ఫిలిప్, సుధాకర్ కోమాకుల ఇతర పాత్రలు పోషించిన వెబ్ సిరీస్ 'ఇసాకపట్నం'. గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించారు. తమడా మీడియా ప్రోడక్షన్స్ పై రాహుల్ తమడా, సెదీప్ రెడ్డి బొర్రా నిర్మించారు. అమెజాన్ ప్రైమ్ వీడియో తెలుగు ఒరిజినల్ వెబ్ సిరీస్‌గా రూ పొందిన ఈ సిరీస్ జూలై 2 నుంచి తెలుగుతో పాటు తమిళ్, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఇసాకపట్నం' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఐశ్వర్యా రాజేష్ మాట్లాడుతూ-''పవర్, సంఘర్షణతో నిండిన ప్రపంచంలో ధైర్యం, బలహీనత, ఆత్మవిశ్వాసంతో తనదైన నిర్ణయాలతో ముందుకు సాగే పాత్ర నాది.ఈ పాత్రను పోషించడం ప్రత్యేకమైన అనుభవం'' అని చెప్పా రు. ''ఇసాకపట్నం' ఒక కల్పిత ప్రపంచంలో సాగే కథ అయినప్పటికీ పాత్రలు, వారి భావోద్వేగాలు చాలా నిజాయితీగా ఉంటాయి'' అని గ్యారీ బీహెచ్ తెలిపారు. ''ఆశ, ప్రతీకారం, అధికారం కోసం మనుషులు ఎంత దూరమైనా వెళతారనే విషయాన్ని ఈ కథ బలంగా చెబుతుంది'' అన్నారు సముద్రఖని. నటులు నరేష్ అగస్త్య, మెరిన్ ఫిలిప్ మాట్లాడారు.

# కుబేర నటి బ్రేకప్.. ప్రియుడి ఫోటోలు డిలీట్



ప్రస్తుత రోజుల్లో డేటింగ్, బ్రేకప్స్ చాలా సర్వ సాధారణమైపోయాయి. ఇది సినీ రంగంలో కాస్తా ఎక్కువే. తాజాగా మరో నటి బ్రేకప్ చేసుకున్నట్లు తెలుస్తోంది. తెలుగులో కుమార్ వర్సెస్ కుమారి అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ సునయన.. ఆ తర్వాత పలు సినిమాలు చేసింది. అయితే ఆమె తన ప్రియుడితో విడిపోయినట్లు సమాచారం. కాగా.. యునైటెడ్ అరబ్ ఎయిర్‌రైట్స్‌కు చెందిన కఖలిత్ అల్ అమెరికా అనే వ్యక్తి ప్రేమలో పడిన సునయన.. వీరి ప్రేమ వ్యవహారం నిశ్చితార్థం వరకు కూడా వెళ్లింది. తాజాగా వీరిద్దరి రిలేషన్‌కు ఎండ్ కార్డ్ పడినట్లేనని అర్థమవుతోంది. ఆమె తన ప్రియుడితో ఉన్న ఫోటోలను ఇన్‌స్టా నుంచి డిలీట్ చేసింది. దీంతో బ్రేకప్ వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే ఈ వ్యవహారంపై సునయన గానీ.. ఆమె ప్రియుడు గాని స్పందించకపోవడం గమనార్హం. కాగా.. నాగ్‌పూర్‌కు చెందిన సునయన ఎల్లా మోడల్‌గా తన కెరీర్ ప్రారంభించింది. 2005లో తెలుగులో కుమార్ వర్సెస్ కుమారి అనే చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మలయాళం, కన్నడ చిత్రాల్లో అవకాశాలొచ్చాయి. అదేవిధంగా కాదలిల్ విళిందేన్ అనే చిత్రంతో తమిళంలోనూ అడుగుపెట్టింది. ధనుశ్, నాగార్జున నటించిన కుబేర మూవీలోనూ మెరిసింది. తమిళంలో మాసిలామణి ,వంశం, నీర్ పార్వైవ, సమర్ వంటి పలు చిత్రాల్లో నటించారు.

# మరో స్టార్ పొలిటికల్ ఎంట్రీ.. క్యూ కడుతున్నారుగా..!



కోలీవుడ్ స్టార్స్ సినిమాలతో పాటు పాలిటిక్స్ వైపు దూసుకెళ్తున్నారు. తమిళనాట కొత్త పార్టీ పెట్టిన దళపతి విజయ్ ఎన్నికల్లో పోటీ చేసిన తొలిసారే సీఎం అయ్యారు. అదే స్ఫూర్తితో రాఘవ లారెన్స్ సైతం రాజకీయాల్లోకి వచ్చే అవకాశముందని క్లారిటీ ఇచ్చేశారు. ఎప్పుడనేది మాత్రం సస్పెన్స్ కొనసాగించారు. విజయ్ పార్టీలో చేరతారా? లేదా అన్నదానిపై రాబోయే రోజుల్లో తెలియనుంది. ఇదిలా ఉండగానే మరో స్టార్ పొలిటికల్ ఎంట్రీపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. హీరోగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎదిగిన జీవీ ప్రకాశ్ కుమార్ రాజకీయాల్లోకి రావడంపై క్లారిటీ ఇచ్చారు. సినీ ప్రయాణం ఇంకో 15 ఏళ్లు కొనసాగుతుందో లేదో చెప్పలేనని జీవీ ప్రకాశ్ అన్నారు. ఆ తర్వాత తాను ప్రజాసేవపైనే దృష్టి పెడతానని కీలక వ్యాఖ్యలు చేశారు. నా ఆలోచనలకు సరిపోయే వేదిక దొరికితే కలిసి పనిచేయడానికి సిద్ధమని తెలిపారు. ఈ ప్రకటనతో భవిష్యత్తులో తాను రాజకీయాల్లోకి రావడం ఖాయమని హింట్ ఇచ్చారు జీవీ ప్రకాశ్. తాజా ఇంటర్వ్యూలో ఈ కామెంట్స్ చేశారు. ఇటీవలే రాఘవ లారన్స్, రజినీకాంత్ అల్లుడు లాంటి వాళ్లు రాజకీయాల్లోకి వస్తున్నారని వార్తలొచ్చాయి. లారెన్స్ ఇప్పటికే ఎంట్రీపై క్లారిటీ ఇచ్చాడు. తాజాగా మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ సైతం తన పొలిటికల్ ఎంట్రీ సంకేతాలిచ్చారు. ఇదంతా చూస్తుంటే కోలీవుడ్ ఇండస్ట్రీ సినిమాల కంటే ఎక్కువగా రాజకీయాల వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో సినీ ఇండస్ట్రీ.. తమిళనాట రాజకీయాలను శాసించనుందా? అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# డిసెంబరులో...

ప్రభాస్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ లవ్‌స్టోరీ మూవీ 'ఫౌజి'. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే ఈ సినిమా కథలో బ్రిటిష్ సోల్జర్ పాత్రలో ప్రభాస్ నటిస్తున్నారని తెలిసింది. ఇమాన్వి ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద, భానుచందర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా 'ఫౌజి' సినిమాను దసరా సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు ఇటీవల మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ సినిమా చిత్రీకరణ ఇంకా పూర్తి కాని నేపథ్యంలో దసరాకు రిలీజ్ కావడం లేదని తెలిసింది. డిసెంబరు మొదటి వారంలో రిలీజ్ చేయాలని ప్రభాస్ అండ్ టీమ్ ప్లాన్ చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. అంతేకాదు.. ఈ చిత్రంలో దేశభక్తి అంశాలు ఉండటంతో ఆగస్టు 15కి 'ఫౌజి' టీజర్‌ను రిలీజ్ చేసే ఆలోచనలో చిత్ర యూనిట్ ఉందట.మరి.. 'ఫౌజి' డిసెంబరులోనే థియేటర్స్‌కు వస్తుందా? అనే విషయంపై క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు. ఇదిలా ఉంటే... ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్' మూవీ చిత్రీకరణతో బిజీగా ఉన్నారని తెలిసింది. త్వరలోనే నాగ్ అశ్విన్ డైరెక్షన్ లో 'కల్కి 2' చిత్రీకరణలో పాల్గొంటారు. 'స్పిరిట్' సినిమా 2027 మార్చి 5న రిలీజ్ కానుంది. 'కల్కి 2' రిలీజ్ డేట్‌పై స్పష్టత రావడానికి మరికొంత సమయం వేచి చూడాల్సిందే.

# పెద్ది కొత్త వర్షన్.. థియేటర్లలో ఎప్పుడంటే?



రామ్ చరణ్ హీరోగా వచ్చిన రూరల్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఈ మూవీ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. తొలి రోజే పాజిటివ్ టాక్ అందుకున్న ఈ సినిమా రూ.400 కోట్ల మార్క్ దిశగా దూసుకెళ్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించింది. అయితే ఆమె రోల్ అచియ్యమ్మ పాత్రపై విమర్శలొచ్చాయి. జాన్వీ కపూర్ సీన్స్ అభ్యంతరకరంగా ఉన్నాయని విమర్శించారు. దీంతో జాన్వీ కపూర్‌పై సన్నివేశాలపై డైరెక్టర్ బుచ్చిబాబు క్షమాపణలు కూడా చెప్పారు. ఆ తర్వాత ఆ సీన్స్‌ను మూవీ నుంచి తొలగించారు. అయితే జాన్వీ కపూర్ సీన్స్ తొలగించిన పెద్ది మేకర్స్ మరి కొన్ని సన్నివేశాలను యాడ్ చేశారు. కొత్త వర్షన్‌లో జాన్వీ కపూర్ పాత్రపై రెండు సన్నివేశాలు, సీనియర్ నటుడు జగపతి బాబుకు సంబంధించిన ఓ సీన్ ఉంటుందని ప్రకటించారు. కొత్తగా సీన్స్ యాడ్ చేసి పెద్దిని థియేటర్లలో రన్ చేయనున్నారు. కొత్త సన్నివేశాలు ఈ నెల 17 నుంచి అందుబాటులోకి వస్తాయని మేకర్స్ ప్రకటించారు. సక్సెస్ మీట్‌లో బుచ్చిబాబు మాట్లాడుతూ.. "మేము ఇప్పటికే ఎడిటింగ్ పూర్తి చేశాం. ఈ బుధవారం నుంచి కొత్త సీన్స్ జోడిస్తాం. మేము మొత్తం మూడు సన్నివేశాలను చేర్చాం. హీరోయిన్‌కు సంబంధించిన సన్నివేశాలు.. అలాగే జగపతి బాబు కోసం ఓ సీన్ ఉంటుంది. ఈ సన్నివేశాలు అచియ్యమ్మ పాత్రకు మరింత భావోద్వేగ లోతును తీసుకొస్తాయి. జాన్వీ పాత్ర మరో స్థాయికి చేరుకుంటుందని నమ్ముతున్నా" అని బుచ్చి బాబు సానా అన్నారు.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034